TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం

ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి

జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 145 | మంగళవారం, జూన్ 16, 2026 | పేజీలు : 02 | వెల రూ. 1.00/-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754



## ప్రజల సమస్యల పరిష్కారంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవ

### ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న రైతు భూమి వివాదానికి ముగింపు.

**ప్రజల సమస్యల పరిష్కారంలో జనగామ జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

నేటి ప్రభాత దర్శిని జనగామ జూన్ 16:-ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని సత్వర పరిష్కారం అందించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు వరంగా మారుతుందని చెప్పవచ్చు, అయితే ఇక్కడ ఈ విషయంలో ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను అనుసరించి ఆయా సమస్యలపై తమ దరఖాస్తులను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ కి వచ్చే ప్రతి ఒక్క బాధితుడి ఫిర్యాదులపై జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక దృష్టి పెడుతూ ఆయా బాధితుల సమస్యలను వెంటవెంటనే సంబంధిత శాఖల అధికారుల ద్వారా విచారణ జరిపించి ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జనగామ జిల్లా ప్రజల ప్రశంసలు పొందుతున్నారు, అదేవిధంగా త్వరితగతిన ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న అనేక సమస్యలు పరిష్కారం కావడంతో బాధితులు కూడా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ సందర్భంగా తాజాగా జనగామ మండలం శామీర్పేట్ గ్రామానికి చెందిన బడుక రామ్ చందర్ ఏళ్ల తరబడి ఆ పరిష్కృతంగా ఉన్నటువంటి తనకు సంబంధించిన భూ సమస్య ప్రజావాణి కార్యక్రమం ద్వారా, జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకుని రావడంతో ఈ విషయంలో జిల్లా కలెక్టరు బాధితుడి పిర్యాదు పై ప్రత్యేక చొరవ చూపడంతో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న తన భూమి సమస్య పరిష్కారం కావడంతో బాధితుడు బదుక రాంచందర్ జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా బదూక రామ్ చందర్ మీడియా తో మాట్లాడుతూ, జనగామ మండలం శామీర్పేట గ్రామానికి చెందిన తనకు సంబంధించిన 23 గుంటల భూమి కొన్ని సంవత్సరాల క్రితం అక్రమంగా తన అన్న బిడ్డ పేరు మీదకు బదిలీ కావడంతో తాను తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు రామచందర్ తెలిపారు, అయితే ఈ యొక్క భూమికి సంబంధించి ఇంతకుముందు పలుమార్లు తాను తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా తన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని రామ్ చందర్ తెలిపారు. కాగా ఈ నేపథ్యంలో మే నెలలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను తాను కలిసి తన సమస్య గురించి వివరించి ప్రజావాణి కార్యక్రమంలో తన వినతి పత్రము సమర్పించినట్లు బాధితుడు రామచందర్ మీడియాతో మాట్లాడారు, ఈ క్రమంలోనే ప్రజావాణి కార్యక్రమంలో తాను సమర్పించిన ఫిర్యాదు పై జనగామ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, సంబంధిత రెవెన్యూ అధికారులకు సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించగా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు భూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవడంతో తనకు న్యాయం జరిగిందని ఈ సందర్భంగా రామ్ చందర్ తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ విధంగా ప్రజల సమస్యలను సానుకూలంగా విని వేగంగా పరిష్కరించడంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవ అభినందనీయమని రామ్ చందర్ పేర్కొన్నారు, ఈ విధంగా సామాన్య ప్రజలకు న్యాయమందించాలని సంకల్పంతో పనిచేస్తున్న జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కీ రామ్ చందర్ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాగా జనగామ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల వినతులను సత్వరమే పరిష్కరిస్తూ జిల్లా కలెక్టర్గా ప్రజల్లో తన పరిపాలనపై విశ్వాసాన్ని పెంపొందిస్తున్న కలెక్టర్ చర్యలు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి అదేవిధంగా, ఈ యొక్క ప్రజావాణి కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజలకు కూడా సత్వర న్యాయం అందుతుందని ప్రజల మనసులో విశ్వాసాన్ని పెంపొందించడానికి ఇటువంటి ఘటనలు మరింత బలాన్ని ఇస్తాయని చెప్పవచ్చు.



# వర్షం కోసం రైతన్న ఎదురుచూపులు



### చినుకు పడితేనే పంట వేసింది - దుక్కి దున్ని సిద్ధంగా రైతన్న

### బోరులు ఎండిపోయి, వర్షాధారమే దిక్కు - నైరుతి ఆలస్యంతో ఆందోళన

**నేటి ప్రభాత దర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

"ఒక్క చినుకు పడితే చాలు, విత్తనం భూమిలో పడేది" అంటూ కామారెడ్డి జిల్లా రైతన్న ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. జూన్ నెల సగం గడిచినా నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించకపోవడంతో ఖరీఫ్ సాగుపై అనిశ్చితి నెలకొంది. దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసుకున్న అన్నదాతలు, ఒక్క మంచి వాన కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు

**నేల సిద్ధం - వాన కోసం నిరీక్షణ**

బాన్సువాడ డివిజన్లోని (హనుమాజీపేట్, కోనాపూర్ ,సంగోజిపేట్, ఖాదళాపూర్,పైడిమల్, సిద్దాపూర్, పలు తాండాలు) గట్టుమీద ప్రాంతాలు వర్షాధారమే. రోహిణి కార్తెలో పడాల్సిన వాన పడకపోవడంతో మృగశిర కార్తె కూడా అయిపోవచ్చింది అయినా రైతులు ధైర్యం కోల్పోలేదు. ఎకరాకు రూ. 2500-3000 ఖర్చుపెట్టి మే నెలలోనే దుక్కులు దున్ని పెట్టారు. సోయా, పత్తి, కంది విత్తనాలను ఇంట్లోనే భద్రపరుచుకున్నారు. "దున్నిన దుక్కి ఆరిపోతుంది. ఇప్పుడు పడే వానే మాకు ప్రాణం" అని రైతులు అంటున్నారు.

**చినుకు పడితేనే బతుకు"**

బోర్లు, బావులు పూర్తిగా అడుగంటడంతో ఈసారి వర్షమే ఏకైక ఆధారం. "గతేడాది వర్షం లేక బోరులో నీళ్లు లేవు. కరెంట్ ఉన్నా లాభం లేదు. పైనుంచి వాన పడితేనే భూమి చల్లబడి, విత్తనం మొలకెత్తుతుంది. లేకపోతే అప్పు చేసి కొన్న విత్తనాలు వృథానే" అని రైతులు కన్నీళ్లు పెట్టుకుంది. "అప్పు చేసి కౌలుకు భూమి తీసుకున్నాం. వాన పడకపోతే కుటుంబం గడవడమే కష్టం. పిల్లల ఫీజులు, అప్పుల వాళ్ల తిప్పలు. ఈ చినుకే మా బతుకును నిలబెట్టాలి" అని కౌలు రైతు సాయిలు ఆవేదన వ్యక్తం చేశారు.వర్షం రైతుకు కేవలం నీరు కాదు, అది ధైర్యం, అదే బతుకు. చినుకు పడితేనే మళ్లీ పొలం పచ్చబడేది, రైతు కళ్లలో ఆశలు చిగురించేది. ఈసారైనా వరుణుడు కరుణించి, అన్నదాత కష్టానికి ఫలితం దక్కాలని రైతులు కోరుతున్నారు.

# ఉపాధ్యాయులు ఫుల్...

# విద్యార్థుల హాజరు తక్కువ





### అమావాస్య ఎఫెక్ట్‌తో పాఠశాలలు వెలవెల

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

వేసవి సెలవుల అనంతరం సోమవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమైనా తరగతి గదులు వెలవెలబోయాయి. మొదటి రోజు 'అమావాస్య' కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ఉపాధ్యాయులు 100% హాజరైనా విద్యార్థుల హాజరు 10% కూడా దాటలేదు.

**అమావాస్య సెంటిమెంట్ దెబ్బ**

కామారెడ్డి జిల్లాలోని బిచ్కుంద, బాన్సువాడ, గాంధారి, పిట్లం జుక్కల్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. "మంచి రోజు చూసి పిల్లలను బడికి పంపుతాం. అమావాస్య రోజు కొత్త పని మొదలుపెట్టం" అని తల్లిదండ్రులు తెగేసి చెబుతున్నారు. దీంతో చాలా పాఠశాలల్లో 30 మంది విద్యార్థులకు గాను 2 లేదా 3 మంది మాత్రమే హాజరయ్యారు. జుక్కల్ మండలం బస్వాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, "ఉదయం 9 గంటలకు స్కూల్ తాళం తీసి ప్రార్థనకు రెడీ అయ్యాం. కానీ మొత్తం స్కూల్‌లో ఐదుగురు పిల్లలే వచ్చారు. మేము 8 మంది టీచర్లం ఖాళీ బెంచీలకు పాఠం చెప్పినట్లయింది" అని వాపోయారు.

**టీచర్లు మాత్రం ఫుల్ హాజరు**

విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని 100% ఉపాధ్యాయులు సోమవారం విధులకు హాజరయ్యారు. పాఠశాలలను రంగురంగుల తోరణాలు, బెలూన్లతో అలంకరించారు. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు చాక్లెట్లు, పూలు సిద్ధం చేసుకున్నారు. కానీ ఎదురుచూపులే మిగిలాయి.బాన్సువాడ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలోని ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "పిల్లలు లేకుండా బడి బోసిపోయింది. రేపటి నుంచి అయినా వస్తారని ఆశిస్తున్నాం. తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాం. మూఢనమ్మకాలు వీడి పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకోవాలి" అని కోరారు. ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశమై అవగాహన కల్పించాలని ఆదేశించాం. అమావాస్య, పౌర్ణమి రోజులతో చదువుకు సంబంధం లేదని చెప్పాం" అని తెలిపారు. బాన్సువాడ, జుక్కల్ బిచ్కుంద పట్టణాల్లోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం 40-50% వరకు హాజరు నమోదైంది. పట్టణ తల్లిదండ్రుల్లో సెంటిమెంట్ ప్రభావం తక్కువగా ఉండడమే ఇందుకు కారణమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏదేమైనా, 'బడి' తెరిచిన మొదటి రోజే 'అమావాస్య' అడ్డుపడడంతో 'చదువుల పండుగ'కు ఆదిలోనే ఆటంకం కలిగినట్లయింది. రేపటి నుంచైనా తరగతి గదులు విద్యార్థుల కిలకిలారావాలతో కళకళలాడాలని ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కారం చేయాలి. జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాను



**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. కరుణాకర్**

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 93 దరఖాస్తులు వచ్చాయని భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఉపాధి, గృహాలు, రెవెన్యూ , ఇతర శాఖలకు సంబంధించిన వినతులు ప్రజలు సమర్పించారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఆర్డీవో గిరి, జడ్పీ సి ఈ ఓ.చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నా పేరు మీద వస్తున్న ఆడియో దుష్ప్రచారంపై సమగ్ర విచారణ జర్పించాలని కామారెడ్డి డిఎస్పీకి ఫిర్యాదుచేసిన.పోసానిపేట మాజీ సర్పంచ్. గీరెడ్డి మహేందర్ రెడ్డి.







**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. కామారెడ్డి. కరుణాకర్.**

తన పేరుతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ పేరును ఉపయోగిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఆడియో పూర్తిగా నకిలీదని, దానిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోసానిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త గిరెడ్డి మహేందర్ రెడ్డి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కామారెడ్డి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ), కామారెడ్డి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు ఫిర్యాదు చేశారు. గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా పనిచేస్తూ వివిధ పదవులు నిర్వహించిన తాను, షబ్బీర్ అలీ ఎలాంటి ఫోన్ సంభాషణ జరపలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే జూన్ 12 రాత్రి నుంచి కొందరు వ్యక్తులు తాను మరియు షబ్బీర్ అలీ గారు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లుగా, కాంగ్రెస్ పార్టీ నాయకులను విమర్శించినట్లుగా, మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడినట్లుగా ఒక ఆడియోను సృష్టించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆడియో ప్రచారం అనంతరం తనపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు, దూషణలు జరుగుతున్నాయని, కొందరు వ్యక్తులు బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించడం, పార్టీని చీల్చడం, నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీయడం లక్ష్యంగా ఈ కుట్ర జరిగి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కావున తాను మరియు షబ్బీర్ అలీ గారు మాట్లాడినట్లుగా తప్పుడు వాయిస్ ఆడియోను సృష్టించిన వ్యక్తులను, అలాగే ఆ ఆడియోను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. నకిలీ ఆడియో ప్రచారం వల్ల తన ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగిందని, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి తనకు న్యాయం చేయాలని పిర్యాదు చేశారు.

# రైతు లేవగానే ఫోన్ చేతిలో పట్టాల్సిందే

**యాప్ ఓపెన్ చేసి యూరియా స్టాక్ చూడాల్సింది**
**స్టాక్ చూసే లోపే బుకింగ్స్ 10.నిముషాలలో యూరియా బుక్ బ్యాగ్స్ అవుతున్నాయి.**
**మహిళ రైతులకు. వృద్ధులకు స్మార్ట్ ఫోన్ లేని వారికీ చాలా కష్టం**
**ఉన్నత అధికారులు దృష్టిలో ఉంచుకొని యాప్ కష్టాలు తొలగించాలి అని రైతుల ఆవేదన**



**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి కరుణాకర్. కామారెడ్డి**

“రైతన్నకు కష్టాలు కొత్త కావు.. కానీ ఈసారి వచ్చిన కష్టం మాత్రం విచిత్రమైనది, అంతకంటే దారుణమైనది. ఒకవైపు ఆకాశం వైపు చూస్తూ విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న కామారెడ్డి జిల్లా రైతులకు.. ఇప్పుడు పొలం పనుల కంటే, తెల్లవారుజామునే స్మార్ట్‌ఫోన్లలో వేళ్లు ఆడించడమే పెద్ద పరీక్షగా మారింది. జిల్లావ్యాప్తంగా యూరియా దొరకడం ఇప్పుడు కత్తి మీద సాముగా మారింది. పొలాల్లో నాగలి పట్టాల్సిన చేతులు.. యూరియా బుకింగ్ కోసం తెల్లారకముందే ఫోన్లు పట్టుకుని యుద్ధం చేయాల్సి వస్తోంది.

**ఆరు దాటితే.. ఆశలు వదులుకోవాల్సిందే!**

ప్రభుత్వం తెచ్చిన ఆన్‌లైన్ బుకింగ్ విధానం లక్ష్యం గొప్పగా ఉన్నప్పటికీ జిల్లాలోని రైతులకు చుక్కలు చూపిస్తోంది. ప్రతిరోజూ ఉదయం సరిగ్గా 6 గంటలకు బుకింగ్ విండో ఓపెన్ అవుతుంది. ఆ సమయానికి నెట్‌వర్క్ సిగ్నల్ బాగుండి,అదృష్టం కలిసి వస్తేనే బుకింగ్ అవుతుంది. కనురెప్ప మూసి తెరిచేలోగా, సెకన్ల వ్యవధిలోనే ‘స్టాక్ అయిపోయింది’ అంటూ స్క్రీన్‌పై మెసేజ్ దర్శనమిస్తోంది. ఉదయం 6:05 గంటలకు లాగిన్ అయినా లాభం లేని పరిస్థితి. దీంతో రైతులు తెల్లవారుజామున నిద్రలేచి, ఎక్కడ సిగ్నల్ వస్తుందో వెతుక్కుంటూ రోడ్లపైకి, రచ్చబండ దగ్గరకు పరుగులు తీస్తున్నారు.

**రెండు బస్తాల కోసం ఎక్కడ స్టాక్ ఉంటే అక్కడికి పరుగులు..**

జిల్లాలోని ఏదో ఒక మండలంలో లేదా మారుమూల గ్రామంలోని ఫర్టిలైజర్ షాపులోనో, సొసైటీలోనే యూరియా నిల్వలు ఉన్నట్లు యాప్‌లో చూపిస్తే రైతులు చేసేదేమీ లేక లబోదిబోమంటున్నారు. కేవలం రెండు బస్తాల యూరియా కొరకు.. అదృష్టం కలిసి వచ్చి ఎక్కడో దూరంగా ఉండే సెంటర్లో బుక్ అయితే, అంత దూరం ప్రయాణించి, రవాణా చార్జీలు భరించి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. స్థానికంగా ఎరువులు దొరకకపోతే పక్క మండలాల చుట్టూ అయిన తిరగాల్సి రావడంతో చిన్న, సన్నకారు రైతుల సమయం, డబ్బు వృధా అవుతున్నాయి.

**యాప్‌లు మాకొద్దు బాబోయ్.. లబోదిబోమంటున్న రైతులు**

ఈ డిజిటల్ తలనొప్పి చదువుకోని, స్మార్ట్‌ఫోన్ వాడకం తెలియని వృద్ధులకు, పేద రైతులకు ఒక శాపంగా మారింది. అసలు ఫోన్ ఎలా వాడాలో తెలియని వారు యూరియాను ఎలా బుక్ చేసుకోవాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. గ్రామాల్లో ఇతరులను, యువకులను బతిమిలాడటం,వారి చుట్టూ పట్టా పాస్ బుక్ వెంట పెట్టుకుని తిరగడం వీరికి నిత్యకృత్యంగా మారింది.? సాంకేతికత తెలియడమే తాము చేసిన పాపమా? మాకు ఎరువులు దక్కవా? అని వృద్ధ రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**అధికారులారా.. క్షేత్రస్థాయికి రండి!**

పారదర్శకత పేరుతో గదుల్లో కూర్చుని తయారు చేసే ఇటువంటి ఆన్‌లైన్ విధానాలు క్షేత్రస్థాయిలో రైతులను ఎలా వేధిస్తున్నాయో కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉన్న పరిస్థితులే నిదర్శనం.ఒకవైపు మార్కెట్‌లో నకిలీ విత్తనాల భయం,మరోవైపు ప్రాణాధారమైన యూరియా కోసం ఆన్‌లైన్ గండం.. వెరసి రైతన్న నలిగిపోతున్నాడు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, జిల్లావ్యాప్తంగా ఆన్‌లైన్ కోటాను పెంచడమో,లేదా పాత పద్ధతిలోనే సొసైటీల ద్వారా నేరుగా ఎరువులు పంపిణీ చేయడమో చేయాలని జిల్లా రైతాంగం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది.

**ఆరు గంటలకే ఆన్‌లైన్ యుద్ధం: యువ రైతు కురుమ అనిల్, (తాడ్వాయి, కామారెడ్డి జిల్లా)**

పొద్దున్నే ఆరు కాకముందే ఫోన్ చేతిలో పట్టుకొని కూర్చోవాల్సి వస్తుంది. ఒక్క నిమిషం లేటైనా సర్వర్ రాదు, యూరియా దొరకదు. మా లాంటి చిన్న రైతులకు ఈ ఫోన్ల బుకింగ్ ఏందో.. మా కష్టాలేందో అర్థం కావడం లేదు. అధికారులు పాత పద్ధతిలోనే సొసైటీల ద్వారా ఇస్తే బాగుంటుంది. జిల్లాలో ఎక్కడికి పోయినా రైతుల బాధ ఇదే.

**ఆన్‌లైన్ ఇబ్బందులపై జిల్లా అధికారుల మీటింగ్‌లో చర్చిస్తాం: తాడ్వాయి వ్యవసాయ అధికారి నర్సింలు**

సాంప్రదాయ యూరియా పంపిణీలో పారదర్శకత కోసమే ఆన్‌లైన్ విధానం తెచ్చినప్పటికీ, ఉదయం వేళల్లో సర్వర్ ఒత్తిడి, నెట్‌వర్క్ సమస్యల వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. అయితే, రైతులు సాంప్రదాయ బస్తా యూరియా వాడకాన్ని తగ్గించి, అధునాతన నానో యూరియా వాడకం వైపు మళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఆన్‌లైన్ బుకింగ్ వల్ల చిన్న, వృద్ధ రైతులు పడుతున్న డిజిటల్ కష్టాలు, స్టాక్ కోసం దూర ప్రాంతాలకు వెళ్ళి వస్తున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయి. జిల్లా అధికారులతో ఒక ముఖ్యమైన సమావేశం జరగనుంది. ఈ మీటింగ్‌లో క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. ఆన్‌లైన్ కోటా పెంచేలా లేదా రైతులకు సులువైన పద్ధతిలో స్థానికంగానే ఎరువులు అందేలా ప్రత్యామ్నాయ మార్గాల కోసం అధికారులతో చర్చిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

# పల్స్ పోలియో కార్యక్రమం పై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులతో కామారెడ్డి కలెక్టర్ సమావేశం




పల్స్ పోలియో కార్యక్రమం – 28 జూన్ 2026, నేషనల్ డీవార్మింగ్ డే – 13 జూలై 2026 మరియు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం. అనగా 15-06-2026 తేదీన కామారెడ్డి జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ ఆశీష్ సంగ్వాన్, ఐఏఎస్ గారి అధ్యక్షతన ఐడీఓసీ (×ఐూఐ) ప్రధాన సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమం, నేషనల్ డీవార్మింగ్ డే మరియు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ అమలుపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ విక్టర్ గారు, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ గిరి గారు, జెడ్పీ సీఈఓ శ్రీ చంద్ర నాయక్ గారు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకట్ గారు, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (×పీూ) ప్రతినిధులు, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం. రోహిత్ కుమార్ గారు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు గౌడ్ గారు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటస్వామి గారు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ ఆశీష్ సంగ్వాన్, ఐఏఎస్ గారు మాట్లాడుతూ, జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో అత్యంత విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు అందేలా వైద్య మరియు ఆరోగ్య శాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించిందని, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లు, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ మరియు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హత గల చిన్నారికి రెండు చుక్కల పోలియో వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకట్ గారు మాట్లాడుతూ, జిల్లాలో 0--5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం జిల్లాలో 733 పల్స్ పోలియో బూత్‌లు, 36 ట్రాన్సిట్ పాయింట్లు, 22 మొబైల్ టీమ్‌లు మరియు 199 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. జూన్ 28న బూత్ స్థాయి కార్యక్రమం, అనంతరం జూన్ 29 మరియు 30 తేదీలలో ఇంటింటి సర్వే (హౌస్ టు హౌస్) కార్యక్రమం నిర్వహించి, బూత్‌లలో మిగిలిపోయిన ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. వలస కార్మికులు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు మరియు ఇతర హైరిస్క్ ప్రాంతాల్లో ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ టీమ్‌ల ద్వారా ప్రత్యేకంగా సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు పల్స్ పోలియోపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని జూలై 13, 2026న, అలాగే మాప్-అప్ రౌండ్‌ను జూలై 20, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు మరియు యుక్తవయస్కులకు అల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇక స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జూన్ 16 నుండి జూలై 31, 2026 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు జింక్ మాత్రలను పంపిణీ చేయడంతో పాటు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, తల్లిపాలు ఇవ్వడం, సురక్షిత తాగునీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు ప్రతి రెండు రోజులకు ఒకసారి క్లోరినేషన్ నిర్వహించాలని, ఎక్కడైనా డయేరియా కేసులు గుర్తించిన వెంటనే సమీప ఉపకేంద్రంలోని ఏఎన్ఎం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారి లేదా సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం అందించి తక్షణ వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పల్స్ పోలియో, నేషనల్ డీవార్మింగ్ డే మరియు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయడానికి అన్ని శాఖలు పూర్తి సహకారం అందించాలని నిర్ణయించారు.

